ఆడబిడ్డకు శఠగోపం!



అధికారం కోసం మాయమాటలు చెప్పడంతో చంద్రబాబు కాకలు తీరారు. ఓట్ల కోసం అలవి కాని హామీలు గుప్పించడంతో పండిపోయారు. పీఠం ఎక్కిన తర్వాత ప్రజలను బురిడీ కొట్టించడంలో పీహెచ్‌డీ చేశారు. ఈ విషయంలో ప్రధానంగా మహిళలకు ఘనత వహించిన బాబుగారి నైజంపై స్పష్టమైన అవగాహన ఉంది. అయితే మారిన మనిషిని అని ఊదరగొట్టడంతో 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో మరోసారి చంద్రబాబు విసిరిన పథకాల ఉచ్చులో చిక్కుకున్నారు. మహాశక్తి పథకం కింద ఆడబిడ్డ నిధి పేరిట ప్రతి అతివకు నెల నెలా రూ.1,500 అందిస్తామన్న బూటకపు మాటలకు పడిపోయారు. కూటమికి ఓట్లు కుమ్మరించారు. ఇంకేముంది బాబుగారు మళ్లీ తన నిజస్వరూపం బయటపెట్టేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాది గడుస్తున్నా.. ఇప్పటికీ సదరు పథకం ఊసే ఎత్తకుండా కాలక్షేపం చేస్తున్నారు. ఇటీవల కడపలో నిర్వహించిన మహానాడు సందర్భంగా అయినా ఆడబిడ్డ నిధిపై ప్రకటన చేస్తారని అక్కచెల్లెమ్మలు ఎదురు చూశారు. అయితే ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా ఆడపడుచులకు నిరాశనే మిగిల్చారు.

- ప్రతి నెలా రూ.1,500 చొప్పున అందిస్తామని మోసం
- అమలుకు నోచుకోని మహాశక్తి పథకం
- ఏడాది గడిచినా హామీ ఊసే ఎత్తని ప్రభుత్వం
- ఇప్పటికే ఒక్కో మహిళకు రూ.18వేల బకాయి
- పూతలపట్టు నియోజకవర్గంలో 83,686 మంది ఎదురుచూపు



ఎన్నికలప్పుడు టీడీపీ ప్రకటించిన 'ఆడబిడ్డ నిధి' కరపత్రం

ఐరాల: ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి మహిళలకు శఠగోపం పెట్టేశారు. 2014 ఎన్నికలప్పుడు డ్వాక్రా రుణాల మాఫీ పేరుతో మోసం చేశారు. మళ్లీ 2019 ఎన్నికల సమయంలో మహాశక్తి పథకం కింద ప్రతి నెలా ఆడబిడ్డలకు రూ.1,500 చొప్పున వారి ఖాతాలో జమ చేస్తామని టోపీ పెట్టేశారు. చంద్రబాబు తీరుపై మహిళలు మండిపడుతున్నారు.

రూ.150 కోట్ల బకాయి

నియోజకవర్గంలో 1,12,815 లక్షల మంది మహిళలు 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. 60 ఏళ్లు పైబడిన వారిని మినహాయిస్తే 2024 జూన్ నాటి లెక్కల ప్రకారం 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు వారు 83,686 మంది మిగులుతారు. వీరికి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.1,500 చొప్పున చెల్లిస్తే నెలకు రూ.125,529,000 చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 నెలలకు రూ.150,063,48,000 చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో పథకం అమలుపై కనీసం మహానాడులో అయినా ప్రకటన చేస్తార,ని ఆశించిన మహిళలకు నిరాశే మిగిలింది. చంద్రబాబు చేసిన మోసంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కూడా స్పందించకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు.

బుద్ధి చెబుతాం



అధికారంలోకి రాక ముందు ఒకలా, వచ్చాక మరోలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మహిళలందరం వచ్చే ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతాం. గత ఎన్నికల సమయంలో కూటమి నేతలు 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి పథకం కింద ఏడాదికి రూ.18వేలు ఇస్తామని నమ్మించి మహిళల ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చారు. ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదు.

–రోజా, దిగువ మోదాలపల్లె, తవణంపల్లె మండలం

బకాయిలతో కలిపి ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ కనీస మాత్రం అమలు కాలేదు. ఆడబిడ్డ నిధి ఇస్తానని చెప్పడంతో లక్షలాది మంది ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. సంపద సృష్టించామని చెబుతున్నారుగా, ఇవ్వండి మరి. మొత్తం బకాయిలతో కలిపి వెంటనే చెల్లించాలి.

–ప్రియ, పుల్లూరు, ఐరాల మండలం

మోసం చేయడం సరికాదు



అధికారంలోకి రాగానే ఏడాదికి రూ.18వేల చొప్పున మహాశక్తి ఆడబిడ్డ నిధి పథకం కింద ఇస్తామన్నారు. ఏడాదవుతున్నా దాని ఊసే లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ హామీని అమలు చేయడం లేదు. సూపర్ సిక్స్ పథకాల కోసం అందరం ఎదురు చూస్తున్నాం. కూటమి నేతలు మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారే గానీ పథకాల గురించి పట్టించుకోవడం లేదు. మాట నిలుపుకోకుండా మోసం చేయడం సరికాదు.

–ఉషారాణి, బంగారుపాళెం

నమ్మకం పోయింది



కూటమి ప్రభుత్వం 18 నుంచి 59 ఏళ్ల మహిళలందరికీ ఏడాదికి రూ.18వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నప్పటికీ దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఎప్పుడు ఇస్తారో చెప్పలేదు. ఈ పథకం అమలయ్యే సూచనలే కనిపించడం లేదు. ఇలా చేయడం సరికాదు. ఈ ప్రభుత్వంపై నమ్మకం పోయింది.

–ఈశ్వరమ్మ, పుల్లూరు, ఐరాల మండలం

పోషహారంతో రక్తహీనత నివారణ


గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: పోషకాహారం భుజిస్తే గర్భిణుల్లో రక్తహీనతను నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఐలవారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో గ్రామానికి వెళ్లి 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు చేసి తగు సూచనలు ఇచ్చారు. హిమోగ్లోబిన్ పెరగాలంటే ఐరన్ ఉండే ఆహార పదార్థాలు తినాలని కోరారు. కూరగాయలు, ఆకుకూరలు, డ్రైఫ్రూట్స్, తృణధాన్యాలు, పప్పు దినుసులు, కోడిగుడ్లుతో పాటు మాంసం, చేపలు వంటి వాటిల్లో ఐరన్ పుష్కలంగా లభిస్తుందని వివరించారు. రక్తహీనత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని వెల్లడించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

జూలైలో సీపీఐ జిల్లా మహాసభలు


మాట్లాడుతున్న రామానాయుడు

చిత్తూరు కార్పొరేషన్: సీపీఐ జిల్లా మహసభలను జూలైలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రామానాయుడు తెలిపారు. శుక్రవారం చిత్తూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై మహసభలో చర్చించి భవిష్యత్ కార్యచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అడవుల్లోని ఖనిజాలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. అందులో భాగంగానే కగార్ ఆపరేషన్ పేరుతో మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేస్తోందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. జిల్లాలోని మామిడి రైతులకు గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించడంలో నిర్లక్ష్యంగా ఉందని, రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి దాపురించిందని విమర్శించారు. సమావేశంలో సీపీఐ నేతలు నాగరాజన్, జనార్దన్, మణి, విజయగౌరి, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి ముగ్గురి ఎంపిక


త్రిష

యాదమరి: నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ముగ్గురు విద్యార్థులు ఎంపికై నట్లు ఎంఈఓలు రుక్మిణమ్మ, ప్రసాద్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ డీకే చెరువు పాఠశాల నుంచి సీపీ త్రిష, వరిగపల్లె పాఠశాల నుంచి వేదవ్యాస్, కె.గొల్లపల్లె స్కూల్ నుంచి ప్రదీప్తి ఎంపికైనట్లు వెల్లడించారు. త్రిష రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. వీరికి నాలుగేళ్లపాటు రూ.12వేల చొప్పున ఉపకార వేతనం అందుతుందని వెల్లడించారు.

ఫుడ్ పాయిజన్‌తో పలువురికి అస్వస్థత

యాదమరి: మండలంలోని పెరియంబాదిలో నిల్వ ఉంచిన ఆహారం భుజించి పలువునే అస్వస్థతకు గురైనట్లు వైద్యాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన వైద్యసిబ్బందితో కలిసి పెరియంబాది దళితవాడలో పర్యటించారు. ఫుడ్ పాయిజన్‌కావడంతో పలువురికి వాంతులు విరేచనాలైనట్లు వెల్లడించారు. వేసవి నేపథ్యంలో గ్రామస్తులు ఆహార నియమాలు పాటించాలని కోరారు. ప్రధానంగా చెడిపోయిన మాంసాహారం తింటే చాలా ప్రమాదమని హెచ్చరించారు. గ్రామంలో ఇలాంటి అవాంఛనీయ ఘటనకు ఫుడ్ పాయిజన్ కారణమా, మరేదైనా ఉందా తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు వివరించారు.

పుస్తక పఠనంతో మేధోశక్తి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు


ఐరాల : విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

బంగారుపాళెం: పుస్తకాలను చదవడం ద్వారా మేధోశక్తిని పెంపొందించుకోవచ్చని రామకుప్పం బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధనంజయరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సంబంధించిన అనేక పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే సందేశాత్మక పుస్తకాలు సైతం ఉంటాయని వెల్లడించారు. లైబ్రేరియన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 28 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ఉచిత వేసవి శిబిరం నిర్వహించామని తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జవహర్‌బాషా ఈ మేరకు విద్యార్థులకు సులువుగా బొమ్మలు గీయడంపై అవగాహన కల్పించారు. వలంటీర్ వెంకటేష్ స్పోకెన్ ఇంగ్లిష్, లెక్కల్లో శిక్షణ ఇచ్చారు. వేసవి శిక్షణ శిబిరంలో వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమలు ప్రదానం చేశారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు జవహర్‌బాషాను సన్మానించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సుశీల పాల్గొన్నారు.

ఐరాల: వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు దోహదపడుతాయని ఎంపీడీఓ ధనలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ క్విజ్ పోటీలతో విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెంపొందుతుందని చెప్పారు. చిన్నారులు విజ్ఞానంతో కూడిన ఆటలు ఆడాలని సూచించారు. కాలం వృథా చేయకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లో విజేదలకు ప్రశంసాపత్రాలు, మెమెంటో, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి పంచాయతీ నీటి కొళాయి కనెక్షన్ ఇప్పించాలని లైబ్రేరియన్ సుజాత విజ్ఞప్తి చేశారు. ఎంపీడీఓ స్పందిస్తూ వెంటనే నీటి వసతి కల్పిస్తామని ఇస్తామని హామీ ఇచ్చారు. రీసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

మామిడి మార్కెట్ తనిఖీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలోని మామిడికాయల మార్కెట్‌ను ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుజ్జు ఫ్యాక్టరీ యజమానులు కిలో మామిడిని రూ.8లకు కొనుగోలు చేయాల్సిందే అని స్పష్టం చేశారు. ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, కార్పొరేషన్ కమిషనర్ నరసింహప్రసాద్ పాల్గొన్నారు.

నేడు బక్రీద్

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలని శనివారం బక్రీద్ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈనేపథ్యంలో గిరింపేటలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ప్రార్థనలు ప్రారంభకానున్నాయి. అందులో భాగంగా ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలోని పలు మసీదులను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు.

'నారాయణ'పై చర్యలకు డిమాండ్


ప్రవీణ్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్: నిబంధనలకు నీళ్లు వదలి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజు రూపంలో రూ.వేలు గుంజుతున్న నారాయణ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు నగరంలోని నారాయణ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు ఇస్తున్నారని మండిపడ్డారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం డీఈఓ, డీవైఈఓవో, చిత్తూరు ఎంఈఓ-1 కి తెలిసినప్పటికీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకుంటే ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

క్లుప్తంగా

నేడు ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల గ్రామ సచివాలయంలో శనివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్, ప్రీ ఖరీఫ్ క్యాంపెయిన్ కింద రైతులకు అవగాహన కల్పించనున్నట్లు మండల వ్యవసాయాధికారి చరిత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కలికిరి కేవీకే శాస్త్రవేత్తలు హాజరై సలహాలు అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల రైతులు ఉదయం 10 గంటలకు సచివాలయానికి రావాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ


మాట్లాడుతున్న రిసోర్సు పర్సన్లు

బంగారుపాళెం: స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మండలంలోని సార్కరు పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో రుచికరమైన పౌష్టికాహారం తయారు చేయడం, ఎంతమంది పిల్లలకు ఎంత బియ్యం వేయాలి, కూరగాయలు, పప్పు, నూనె ఉపయోగించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. వంటశాలలు, పరిసరాలను ఎలా శుభ్రంగా పెట్టుకోవాలనే అంశాలను రిసోర్సు పర్సన్లు వివరించారు. ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు శిక్షణ తరగతులను పర్యవేక్షించారు.

ప్రతిభ అవార్డుకు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

పలమనేరు: ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ప్రతిభ అవార్డులకు పట్టణంలోని మధు, శ్రీవాణి విద్యాసంస్థలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్టు కళాశాల నిర్వాహకులు కృష్ణమూర్తి రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయా గ్రూపుల్లో టాపర్లుగా నిలిచిన అల్ఫిన్, మోక్షజ్ఞ, ఫిజా అంజుమ్‌కు ఆయన అభినందనలు తెలిపారు. త్వరలో విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో ప్రభుత్వం ద్వారా ఈ అవార్డులను వీరు అందుకోనున్నట్టు ఆయన తెలిపారు.

మహాప్రస్థానం ప్రారంభం


కైలాసధామాన్ని పరిశీలిస్తున్న రామచంద్ర నాయుడు

చిత్తూరు అర్బన్: నగరంలోని కైలాసపురం ఆవరణలో నిర్మించిన కైలాధామం మహాప్రస్థానాన్ని శుక్రవారం ప్రారంభించారు. గ్యాస్ ఆధారిత దహన క్రియలు నిర్వహించేందుకు దాతల విరాళాలతో లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ సర్వీసెస్, చిత్తూరు ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు సంయుక్తంగా నిర్మించారు. ప్రారంభోత్సవానికి రాజన్న ట్రస్టు నిర్వాహకుడు గల్లా రామచంద్రానాయుడు, ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్ నాయుడు, ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.


వైభవం.. కుంభాభిషేకం


గోపుర శిఖరాన్ని అభిషేకిస్తున్న వేదపండితులు


ప్రత్యేక అలంకరణలో వినాయకస్వామి

గుడిపాల: గుడిపాల మండలం వసంతాపురంలో వెలసిన సుందర వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైభవంగా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, పూర్ణాహుతి, అభిషేకం జరిపించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన చేశారు. సాయంత్రం వినాయకస్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


యూనిఫామ్ అందిస్తున్న ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక వ్యవసాయ శాఖ మామిడికాయల మండీలో చేపట్టిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు చేతులమీదుగా యూనిఫామ్ అందించారు. మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్ పాల్గొన్నారు.

అంతటా అయోమయం!

కూటమి ప్రభుత్వం చేపట్టిన బదిలీలపై ఉద్యోగులు మండిపడుతున్నారు. ప్రధానంగా వైద్య విధాన పరిషత్‌లో ట్రాన్స్‌ఫర్లపై అయోమయానికి లోనవుతున్నారు. జిల్లా ప్రభుత్వాస్పత్రికి రావాలంటే ఆప్షన్ చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే సిబ్బంది కొరతతో ఇబ్బందిపడుతున్న ఈ ఆస్పత్రి నుంచి వెళ్లిపోయేందుకు మాత్రం అప్షన్ పెట్టడంపై గగ్గోలు పెడుతున్నారు. పేదల ఆరోగ్యంపై సర్కారు శీతకన్ను వేసిందని వాపోతున్నారు. అరకొర వైద్యసిబ్బందితో సక్రమంగా చికిత్సలందించడం కష్టతరంగా మారిందని వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టకుంటే ప్రభుత్వాస్పత్రిపై ప్రజలకు నమ్మకం పోతుందని స్పష్టం చేస్తున్నారు.

- వైద్యవిధాన పరిషత్‌లో బదిలీల గందరగోళం
- జిల్లా ప్రభుత్వాస్పత్రికి లేని ఆప్షన్
- రావాలనుకున్నా రాలేకపోతున్నామని ఉద్యోగుల ఆవేదన
- ఇప్పటికే వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- కనీస మాత్రం పట్టించుకోని ప్రభుత్వం



చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ఆస్పత్రికి పేదల పెద్దాస్పత్రిగా పేరు. రోజు సుమారు 1000 మంది ఓపీకి వస్తుంటారు. ఇన్‌పేషెంట్‌లు 350 మంది వరకు ఉంటుంటారు. ఈ కారణంగా వైద్యులు, సిబ్బందిపై భారం, బాధ్యత పెరిగింది. అయితే చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మొత్తం 250 శాంక్షన్ పోస్టులకు గాను 158 మంది మాత్రమే ఉన్నారు. దీంతో వైద్యులు, సిబ్బంది కొరత పీడిస్తోంది. 21 మంది ఉండాల్సిన వైద్యులు కేవలం ఏడుగురు మాత్రమే సేవలందిస్తున్నారు. 78 మంది ఉండాల్సి స్టాఫ్‌ర్సులు 65 మంది మాత్రమే ఉన్నారు. 151 మంది ఉండాల్సిన పారామెడికల్ సిబ్బంది 79 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఈ బదిలీల్లో 5 ఏళ్లు పూర్తి చేసుకున్న వాళ్లు అన్ని కేడర్లు కలిపి సుమారు 50 మంది వరకు ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. ప్రస్తుతం చేపట్టిన బదిలీల్లో ఈ ఆస్పత్రికి పూర్తిస్థాయిలో పోస్టులకు సిబ్బందిని పంపించాల్సి ప్రభుత్వం ఆ విషయాన్ని గాలికి వదిలేసింది. బదిలీ ఆప్షన్‌లో ఇక్కడు వచ్చేందుకు అవకాశం లేకుండా చేసింది. అయితే ఈ ఆస్పత్రి నుంచి వేరేచోటుకు మాత్రం బదిలీకి ఆప్షన్ పెట్టుకునే అవకాశం కల్పించింది. దీంతో అరకొర సిబ్బందికే జిల్లా ఆస్పత్రి పరిమితం కానుంది.

వేధిస్తున్న సమస్య


బదిలీ సమస్యలు, పోస్టుల భర్తీపై రాష్ట్ర స్థాయి అధికారులకు విన్నవిస్తున్న యూనియన్ నేతలు (ఫైల్)

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పలువురు డాక్టర్లు అవసరముంది. ముఖ్యంగా పోస్టుమార్టానికి నలుగురు డాక్టర్లు కావాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. దీనికితోడు స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టులు, ఎఫ్ఎన్‌ఓలు, ఎంఎన్‌ఓలు పదుల సంఖ్యల్లో కావాల్సి ఉంది. వీటిని భర్తీ చేయకపోగా.....కొంత మంది బదిలీపై వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ సిబ్బంది కొరత, వేధింపులు, పనిభారం, ఆస్పత్రిల్లో రాజకీయం, 5 ఏళ్లు దాటిందని, ఇతరత్ర కారణాలతో ఈ ఆస్పత్రిని నుంచి బయట వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ స్థానాలకు బదిలీపై వచ్చేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఇక్కడకు వచ్చేందుకు ఆప్షన్ లేదని అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఇలా అయితే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మరిన్ని పోస్టులు ఖాళీ ఏర్పడనున్నాయి. వైద్య సేవలు మరింత క్షీణించనున్నాయి. అధికారులు ప్రభుత్వంపై సాకు చూపిస్తున్నారు. ఈసమస్యలపై ఇటీవల ఆస్పత్రి విచారణకు వచ్చిన రాష్ట్ర స్థాయి అధికారులకు జిల్లా వైద్య ఉద్యోగ సంఘ నాయకులు విన్నమించారు. డీసీహెచ్ఎస్ పద్మాంజలిని వివరణ కోరగా.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు జరుగుతాయని వెల్లడించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


ఆలయంలో ఎమ్మెల్యేలు మురళీమోహన్, అమర్‌నాథరెడ్డి

తవణంపల్లె: మండలంలోని పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మురళీమోహన్ శుక్రవారం ప్రారంభించారు. అందులో భాగంగా సరకల్లు గ్రామంలో కమ్యూనిటీ భవనం, సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. తవణంపల్లె పీహెచ్‌సీలో పబ్లిక్ హెల్త్ యూనిట్ నూతన భవనం ప్రారంభించారు. జాతీయ క్షయ నిర్మూలనలో భాగంగా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది కుసుమకుమారి, జ్యోతినాథ్, దీపిక, వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, కేశవనారాయణ పాల్గొన్నారు. ఈ క్రమంలోనే సరకల్లులో సర్పంచ్ కత్తి సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కత్తి సుధాకర్‌రెడ్డి, కత్తి రమణారెడ్డి సొంత నిధులతో నిర్మించిన మహాకాళికదేవి, విజయ వినాయక ఆలయాలను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో కలిసి సందర్శించారు. మహాకుంభాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం ముట్టుకూరులో సర్పంచ్ చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో టీటీడీ, దాతల సహకారంతో నిర్మించిన సీతారామాలయ కుంభాభిషేకానికి హాజరయ్యారు. ఈ మేరకు దాతలను అభినందించారు.